# వేగుచుక్క

VC NEWS

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ ఫిబ్రవరి 13 గురువారం 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 205

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




2లో

## బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తాం

**రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. "విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్చి మొదటి వారంలో మంత్రిమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేస్తాం.**

- 42 శాతం కోసం శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు
- కేంద్రానికి నివేదన
- కులగణనలో పాల్గొనని వారికి మరో అవకాశం
- ఈ నెల 16 నుంచి 28 వరకు నమోదు
- విలేకరులతో ఉపముఖ్యమంత్రి భట్టి



# 'స్థానిక' ఎన్నికలు ఇప్పట్లో లేనట్లే!

**తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది.**

హైదరాబాద్: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభలో బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. అలాగే కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరోసారి అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఎన్నికలు ఇప్పుడిప్పుడే జరిగే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. రిజర్వేషన్ల బిల్లు శాసనసభ ఆమోదం పొందాక స్థానిక ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని తెలిపాయి. ప్రభుత్వం 6 నెలలుగా ఎన్నికల నిర్వహణకు సన్నాహాలు చేపట్టింది. రాష్ట్రంలో ఇంటింటి సమగ్ర సర్వే నిర్వహించింది. వాటి వివరాలు వెల్లడయ్యాయి. బీసీ డెడికేటెడ్ కమిషన్ సైతం తమ నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి అప్పగించింది. దాని ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకొని ఎన్నికల సంఘానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది.

42 శాతం బీసీ రిజర్వేషన్లకు కార్యాచరణ కోసం...సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం పోలీసు కమాండ్ కంట్రోలు సెంటర్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లపై సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన... మంత్రులు, అధికారులతో బీసీ రిజర్వేషన్ల అమలు, బీసీ డెడికేటెడ్ కమిషన్ ఇచ్చిన నివేదికపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో రిజర్వేషన్లు 50 శాతం వరకే ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు పోనూ మిగిలినవి బీసీలకు రిజర్వ్ చేయాలని కమిషన్ సిఫార్సు చేసింది. అయితే కులగణన జరిగి బీసీల శాతం తేలడం, కామారెడ్డిలో జరిగిన కాంగ్రెస్ బీసీల సదస్సులో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించిన నేపథ్యంలో దానికి తగ్గట్లుగా కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రితో పాటు ఎక్కువ మంది అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. దాంతో 42 శాతం రిజర్వేషన్లకు శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పంపి అమలుకు ఒత్తిడి చేయాలని నిర్ణయించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కేశవరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక-ప్రణాళిక శాఖ ముఖ్యకార్యదర్శి సుల్తానియా తదితరులు ఇందులో పాల్గొన్నారు.



## మేడారం చిన్న జాతర ప్రారంభం

**ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ చిన్నజాతర (మండమెలిగే) బుధవారం ఘనంగా ఆరంభమైంది.**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క సారలమ్మ చిన్నజాతర (మండమెలిగే) బుధవారం ఘనంగా ఆరంభమైంది. రాత్రి మేడారం, కన్నెపల్లిల నుంచి అమ్మవార్ల అడేరాలు(పూజాసామగ్రి), ఇష్ట నైవేద్యాలతో డోలి వాయిద్యాల నడుమ నృత్యం చేసుకుంటూ పూజారులు గద్దెల వద్దకు చేరుకున్నారు. పూజలు నిర్వహించి అక్కడే రాత్రంతా జాగరణ చేశారు. ప్రజలు భారీగా తరలివచ్చారు. గురువారం ఉదయం అమ్మవార్ల అడెరాలను తిరిగి ఆలయాలకు చేర్చుతారు. శనివారం వరకు జాతర కొనసాగనుంది.



# రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు.

- మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి.
- వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారిపోయారు.
- హామీలపై ప్రజలు నిలదీస్తారనే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారు.
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఘాటు వ్యాఖ్యలు.
- తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం, పోస్టర్లు ఆవిష్కరణ.–
- రేవంత్ రెడ్డి పాలనలో శాంతి భద్రతలు క్షీణించాయి.

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్**

వరంగల్ వచ్చే ధైర్యం లేక కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. హామీలపై ప్రజలు నిలదీస్తారనే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని తెలిపారు. అదే వరంగల్ లో రాహుల్ గాంధీ చేసిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని, కాబట్టి వరంగల్ డిక్లరేషన్ పై రైతులు ప్రశ్నిస్తారని రాహుల్ గాంధీ భయపడ్డారని అన్నారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని హెచ్చరించారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న హైదరాబాద్ లో తలపెట్టనున్న మహిళా శంఖారావం సభ పోస్టర్ ను ఎమ్మెల్సీ కవిత బుధవారం తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మడం లేదని ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి

మిగతా 2లో





## బీసీలకు సీఎం క్షమాపణ చెప్పాలి


హైదరాబాద్: సమగ్ర కుటుంబ సర్వే నివేదికలో బీసీల జనాభా సంఖ్యను తగ్గించి.. వారిని తీవ్ర మానసిక వేదనకు గురిచేసినందుకు రాష్ట్రంలోని బీసీలందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. "అసమగ్ర సర్వేపై భారాసతో పాటు బీసీ సంఘాలు ముక్తకంఠంతో అభ్యంతరం తెలిపాయి. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం అసంపూర్తి లెక్కల ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేయడం ముమ్మాటికీ తప్పే. రెండోసారి సర్వేనైనా సమగ్రంగా చేయాలి. దీంతో పాటు బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. తూతూమంత్రంగా తీర్మానం చేసి.. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి నెట్టెద్దామంటే భారాసతో పాటు బీసీ సంఘాలు ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించవు" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## సంజయ్ మల్హోత్రా సంతకంతో కొత్త 50 నోటు



**ముంబయి:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా త్వరలో కొత్తగా రూ.50 నోట్లను జారీ చేయనుంది. ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా సంతకంతో ఈ నోట్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం చాలా వరకు నోట్లు మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ పేరుతో ప్రింట్ అయినవే సర్క్యులేషన్‌లో ఉన్నాయి. ఆయన స్థానంలో సంజయ్ మల్హోత్రా గతేడాది డిసెంబర్‌లో గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మహాత్మ గాంధీ సిరీస్‌లో కొత్త రూ.50 నోట్లను జారీ చేయాలని నిర్ణయించినట్లు ఆర్‌బీఐ బుధవారం తెలిపింది. ప్రస్తుతం చలామణీలో ఉన్న పాతనోట్లు చెల్లుబాటు అవుతాయని ఆర్‌బీఐ పేర్కొనింది.

## ఆ 103 ఎకరాల భూదాన్ భూములపై వివరాలివ్వండి!



హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారం గ్రామంలో సర్వే నంబరు 181లోని 103.35 ఎకరాల భూమిని ప్రైవేటుకు అప్పగించిన తీరుపై వివరాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని బుధవారం హైకోర్టు ఆదేశించింది. నిషేధిత జాబితాలో ఉన్న భూములను ప్రైవేటు వ్యక్తులకు రిజిస్టర్ చేయడాన్ని సవాలు చేస్తూ మహమ్మద్ ఫరూజ్ అలీఖాన్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన సింగిల్ జడ్జి హక్కులకు సంబంధించిన వివాదాన్ని సివిల్ కోర్టులో తేల్చుకోవాలంటూ కొట్టివేశారు. దీన్ని సవాల్ చేస్తూ ఫరూజ్ అలీఖాన్ అప్పీలుకు వెళ్లగా... తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక యారాలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ... "భూదాన్ భూములంటూ రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత ఆస్తుల జాబితాలో చేర్చిన భూములకు రిజిస్ట్రేషన్ చేయరాదు. ఇక్కడ రిజిస్ట్రేషన్ అధికారులు నిబంధనలను ఉల్లంఘించినందున పిటిషన్ విచారణార్హమే" అని పేర్కొన్నారు. వాదనలను విన్న ధర్మాసనం కౌంటర్లు దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాది కె.మురళీధర్‌రెడ్డిని ఆదేశించింది. ముఖ్యంగా ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చుతూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను సైతం సమర్పించాలంది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్ అభ్యర్థించగా... కౌంటర్లు దాఖలు చేయకుండా అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమంటూ విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

వేగుచుక్క

# బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పిస్తాం

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. "విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మార్చి మొదటి వారంలో మంత్రిమండలిలో ఏకగ్రీవ తీర్మానం చేస్తాం. దానిపై శాసనసభ బడ్జెట్ సమావేశాలలో బిల్లును ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. అన్ని పార్టీల మద్దతుతో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంటులో ఆమోదింపజేస్తాం" అని అన్నారు. బుధవారం కమాండ్ కంట్రోల్ కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కులగణనపై జరిగిన సమీక్ష అనంతరం ఆయన సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియాలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు...

"రాష్ట్రంలో బీసీలకు విద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో 42% రిజర్వేషన్లు కల్పించే విషయంలో ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలను భగ్నం చేస్తాం. వారి జనాభా 56 శాతం పైగా ఉన్నట్లు తాజా కులగణన సర్వేలో తేలింది. దానికి అనుగుణంగా ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా 42 శాతం రిజర్వేషన్లను వారికి ఇవ్వాలని ఇప్పుడు నిర్ణయం తీసుకున్నాం.

దిల్లీకి ప్రతినిధి బృందం

శాసనసభ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో కూడా ప్రవేశపెట్టేందుకు అన్ని ప్రయత్నాలూ చేస్తాం. కలిసి వచ్చే రాజకీయ పార్టీల



వారితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రతినిధి బృందం దిల్లీకి వెళుతుంది. ప్రధానితోపాటు అన్ని పార్టీల నేతలను కలుస్తాం, విజ్ఞప్తి చేస్తాం. పార్లమెంటులో ఈ బిల్లు పాస్ చేయించేందుకు దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలను కూడగడతాం. రాజకీయ శక్తులను ఏకం చేస్తాం. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తీసుకురావడం మా లక్ష్యం. పార్లమెంటులో బిల్లు ఆమోదం కోసం మద్దతు కూడగట్టడానికి రాజకీయ ప్రయోజనాలు పక్కన పెట్టి.. అన్ని పార్టీల వారు, సామాజికవేత్తలు, ప్రజా సంఘాల వారు, మేధావులు కలిసి రావాలి" అని భట్టి కోరారు.

టోల్‌ఫ్రీ, ఆన్‌లైన్, స్వయంగా వివరాలు సమర్పించేందుకు అవకాశం

కులగణనలో పాల్గొనని వారి కోసం ఈ నెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వే నిర్వహిస్తామని భట్టి చెప్పారు. "రాష్ట్రంలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగింది. సర్వేలో 3.1 శాతం మంది పాల్గొనలేదు. కొందరు ఉద్దేశపూర్వకంగా లెక్కలు ఇవ్వడానికి ముందుకు రాలేదు. మరికొందరు తాళాలు వేసుకున్నారు. కేసీఆర్, కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి వంటి వారు ఉద్దేశపూర్వకంగా సర్వేకు సహకరించలేదు. రాష్ట్రంలో కుల గణన విజయవంతం అయితే దేశమంతటా చేయాల్సి వస్తుందని అనుకునేవారు రీ సర్వే కోసం డిమాండ్ చేస్తున్నారు. వారందరి కోసం మరోసారి అవకాశం ఇస్తున్నాం. ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు వివరాలు నమోదు చేసుకోవాలి. మండల కార్యాలయాల్లో ప్రజా పాలన అధికారులు అందుబాటులో ఉంటారు. అక్కడ వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఆన్ లైన్ ద్వారా కూడా కుటుంబ వివరాలు నమోదు చేసుకోవచ్చు. టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని కోరితే అధికారులు ఫోన్ చేసిన వారి ఇంటికి వెళ్లి అన్ని వివరాలు సేకరిస్తారు" అని భట్టి తెలిపారు.

ఆర్థిక భారాన్ని భరిస్తాం...

మళ్లీ సర్వేకు అవకాశం ఇవ్వడం, శాసనసభలో బిల్లు వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమై.. కేంద్ర నిధులు మరిన్ని రోజులు ఆగిపోయే ప్రమాదం ఉంది కదా అని విలేకరులు భట్టిని ప్రశ్నించగా... బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం ఆర్థికభారాన్ని భరించేందుకు రాష్ట్రం సిద్ధంగా ఉందని అన్నారు.

స్వాగతిస్తున్నాం: జాజుల

సమగ్ర కుల సర్వేలో ఇప్పటివరకు పాల్గొనని ప్రజలకు మరోసారి అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్వాగతించారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బుధవారం ఆయనొక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు.

ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని, సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ తెలంగాణకు వచ్చి చిలుక పలుకులు పలికారని విమర్శించారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు... సోనియా, ప్రియాంకా, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ హామీల అమలును విస్మరించిందని




తెలిపారు.అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదని, దాంతో రేవంత్ రెడ్డి మహిళలకు రూ 35 వేల చొప్పున బాకీ పడ్డారని తెలిపారు. రూ. 35 వేలను ప్రతీ మహిళా బ్యాంకు ఖాతాలో జమా చేయాలని డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు స్కూటీ ఇస్తామని రేవంత్ రెడ్డి మోసం చేశారని ధ్వజమెత్తారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ ల పంపిణీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రులకె వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని అన్నారు. బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, తక్షణమే దాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని, ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని

చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయని ఎత్తిచూపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని పేర్కొన్నారు. భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరం అని అన్నారు.

# బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోతున్నాయి



మంత్రి అచ్చన్నాయుడు వెల్లడి

**అమరావతి:** బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని రాష్ట్ర వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు వెల్లడించారు. చనిపోయిన కోళ్లను.. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ల్యాబ్‌కు పంపగా.. అవి బర్డ్ ఫ్లూ వల్లే చనిపోయినట్లు నివేదికలో స్పష్టమైందని చెప్పారు. ఈ వ్యాధి వల్ల ఏలూరు జిల్లా బాదంపూడిలో 2 లక్షల కోళ్లు, ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెంలో 7 వేల కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉందన్నారు. బుధవారం అమరావతిలో మంత్రి అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. పౌల్ట్రీలలో ఉన్న గుడ్లను కూడా పూడ్చి వేయించామని చెప్పారు. ఈ బర్డ్ ఫ్లూ కారణంగా దాదాపు 5 లక్షల కోళ్లు చనిపోయినట్లు సమాచారం ఉందని.. కానీ 40 లక్షల కోళ్లు చనిపోయినట్లు ప్రచారం అయితే జరుగుతోందన్నారు. స్వల్ప ఉష్ణోగ్రతలో ఇలాంటి పరిస్థితి వస్తుందని తెలిపారు. ఈ బర్డ్ ఫ్లూ ప్రబలిన ప్రాంతాల్లో 10 కిలోమీటర్ల పరిధిలోని షాపులను మూసి వేశామన్నారు. ఇక బర్డ్ ఫ్లూ వల్ల ఆందోళన చెందాల్సిన పని లేదని స్పష్టం చేశారు. ఉష్ణోగ్రతలు ఎంత వేగంగా పెరిగితే అంతే వేగంగా ఈ వ్యాధి తగ్గుతుందన్నారు. పౌల్ట్రీలలో శానిటేషన్ సరిగ్గా లేకపోవడం వల్ల ఈ వ్యాధి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 10 కోట్లకు పైగా కోళ్లు ఉన్నాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మరోవైపు తెలంగాణలో సైతం లక్షలాది కోళ్లు ఈ వ్యాధి వల్ల మరణిస్తున్నాయి. ఇక మార్కెట్‌లో చికెన్ ధరలు సైతం అమాంతంగా పడిపోయాయి. కేజీ చికెన్ ధర రూ. 150గా ఉంది. అయినా చికెన్ కొనుగోలు చేసేందుకు వినియోగ దారులు భయాందోళనలకు గురవుతోన్నారు.

# ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థల క్యూ

**లోకేశ్‌ను కలిసిన ఫార్చ్యూన్ కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్**

**పెట్టుబడులు పెట్టేందుకు అంగీకారం**

అమరావతి: ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు క్యూకడుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఇప్పటికే పలు కంపెనీలు రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సీఎం చంద్రబాబుతో ఒప్పందాలు చేసుకున్నాయి. అలాగే జగన్ ప్రభుత్వ హయాంలో ఏపీ నుంచి లూలు సంస్థ వెళ్లిపోయింది. ఆ సంస్థ సైతం మళ్లీ ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి అంగీకారం తెలిపింది. ఇవేగాకుండా టాటా సంస్థతోపాటు పలు ప్రముఖ ఐటీ



కంపెనీలు కూడా ఏపీలో తమ సంస్థలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చాయి. అయితే తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్‌ను ఫార్చ్యూన్ 500 కంపెనీ సిఫీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజు వేగేశ్న బుధవారం కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మంత్రి లోకేష్ ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి సిఫీ ఛైర్మెన్ రాజు వేగేశ్న సుముఖత వ్యక్తం చేశారు.

విశాఖలో మెగా డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ ఏర్పాటుపై నారా లోకేష్ చర్చించారు. ఏపీలో పెట్టుబడులకు ప్రస్తుత అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న సేవలపై వివరణ ఇచ్చారు. నూతనంగా తీసుకువచ్చిన ఐటీ పాలసీల గురించి లోకేష్ ప్రస్తావించారు.

కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క పరిశ్రమ కూడా రాష్ట్రానికి రాకపోవడంతో ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరకలేదు. దీంతో యువత చాలా నష్టపోయింది.

గత జగన్ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో

లూలూ సంస్థ కూడా ఏపీ నుంచి పొరుగు రాష్ట్రాలకు వెళ్లిపోయింది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు కాకపోవడంతో.. ఉపాధి కోసం యువత దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గ్రహించారు. అందుకే..

ఈ ఏడాది మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి, పరిశ్రమల ఏర్పాటుకు దేశవిదేశీ సంస్థలు క్యూ కడుతున్నాయి.



# గ్రూప్-2 పరీక్షల హాల్‌టిక్కెట్లు విడుదల

అమరావతి: ఈ నెల 23వ తేదీన జరగాల్సిన గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ హాల్ టికెట్లను బుధవారం విడుదల చేసింది. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీపీఎస్సీ తెలిపింది. 23న ఉదయం 10 గంటల నుంచి 12.30 వరకు, మధ్యాహ్నం 3 గంటల నుంచి 5.30 వరకు పరీక్ష జరగనుంది. కాగా.. పరీక్షా కేంద్రాలకు కేవలం హాల్ టికెట్ మాత్రమే తీసుకురావాలని, వేరే వస్తువులను ఏమీ తీసుకురావొద్దని ఏపీపీఎస్సీ సూచించింది.

# మాఘపూర్ణిమతో కుంభమేళాకు పోటెత్తిన భక్తులు

కోటిన్నరకు పైగా భక్తులు వచ్చినట్లు వెల్లడ

**ప్రయాగ్‌రాజ్:** ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక వేడుక మహా కుంభమేళా కన్నుల పండువగా కొనసాగుతోంది. దేశ, విదేశాల నుంచి ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. కుంభమేళాలో మరో పుణ్య ఘట్టమైన మాఘ పూర్ణిమ వేళ బుధవారం మధ్యాహ్నం 12గంటల వరకే త్రివేణీ సంగమం, ఇతర ఘాట్‌ల వద్ద దాదాపు 1.60 కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. బుధవారం మాఘ పూర్ణిమ వేళ భక్తుల తాకిడి అధికంగా ఉండటంతో మరింత కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు కుంభ్ మేళా డీఐజీ వైభవ్ కృష్ణ తెలిపారు.

ఈ మాఘ పూర్ణిమ స్నానంతో తమ నెల రోజుల కల్పవాసీ దీక్ష ముగించుకొని దాదాపు 10లక్షల మంది మహా కుంభమేళా నుంచి తిరుగు ప్రయాణం కానున్నారు. దీంతో వారంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పార్కింగ్ స్థలాలను మాత్రమే వినియోగించాలని అధికారులు కల్పవాసీలకు విజ్ఞప్తి చేశారు. మరోవైపు, భక్తులపై హెలికాప్టర్ నుంచి పూల వర్షం కురిపించారు. లఖ్‌నవూలోని తన అధికారిక నివాసం నుంచి సీఎం యోగి ఆదిత్యనాథ్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వార్‌రూమ్‌లో సీఎంతో పాటు డీజీపీ ప్రశాంత్ కుమార్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి



సంజయ్ ప్రసాద్, సీఎం కార్యాలయం అధికారులు ఉన్నారు.

మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే తన సతీమణితో కలిసి త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానం ఆచరించారు. ప్రయాగ్‌రాజ్‌కు మంగళవారమే చేరుకున్నారు. సాధారణ యాత్రకుడిగా పడవపై సంగమం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. మరోవైపు, ఫిబ్రవరి 11వ తేదీ వరకు మొత్తంగా 46.25 కోట్ల మంది భక్తులు మహా కుంభ్‌కు విచ్చేసి పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు వెల్లడించారు.

వేగుచుక్క

## పేద మహిళకు స్వయంగా ఆపరేషన్..!



చాలామంది ఎమ్మెల్యేలు రాజకీయ నాయకులే కాదు.. అటు వృత్తిపరంగా రకరకాల రంగాలకు చెందినవారు కూడా. అందులోనూ కొంత మంది డాక్టర్ వృత్తి నుంచి వచ్చిన వారు కూడా ఉంటారు. అలాంటి డాక్టర్లు ఎమ్మెల్యేలుగా తెలంగాణలో చాలా మందే ఉన్నారు. కాగా.. వాళ్లు ఫక్తు రాజకీయాలే కాకుండా.. అప్పుడప్పుడు తమ వృత్తి ద్వారా కూడా ప్రజాసేవ చేసుకుంటూ.. జనాల చేత నీరాజనాలు అందుకుంటూ ఉంటారు. ఆ కోవకే చెందుతారు అచ్చంపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ. వృత్తిపరంగా డాక్టర్ అయిన వంశీకృష్ణ.. మరోసారి వైద్యునిగా మారారు. ఒంటిపై ఆప్రాన్ వేసుకుని.. చేతిలో కత్తెర పట్టుకుని స్వయంగా ఓ అరుదైన ఆపరేషన్ చేసి.. ఓ పేద మహిళకు ప్రాణదానం చేశారు.

అయితే.. చారకొండ మండలానికి చెందిన గోరేటి లక్ష్మమ్మ.. గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రిలో చూపించుకోగా.. కడుపులో కణతి ఉందని, ఆపరేషన్ చేసి తీసేయ్యాలని సూచించారు. అందుకు బాగానే ఖర్చవుతుందని చెప్పటంతో.. నిరుపేద అయిన లక్ష్మమ్మ ప్రైవేటు హాస్పిటల్‌లో ఆపరేషన్ చే చేయించుకోలేకపోయింది. అటు రాజకీయ మార్గంలోనే కాకుండా తన వృత్తిపరంగానూ ప్రజలకు సేవ చేసే ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ.. తన ఆధ్వర్యంలో అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో రెండోసారి నిర్వహించిన సర్జికల్ క్యాంపు గురించి తెలుసుకున్న లక్ష్మమ్మ అక్కడికి వచ్చింది. తన అనారోగ్య పరిస్థితిని ఎమ్మెల్యేకు విన్నవించింది. మహిళ ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను అర్థం చేసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ.. ఏరియా ఆస్పత్రి వైద్యులతో కలిసి మంగళవారం (ఫిబ్రవరి 11వ తేదీన) లక్ష్మమ్మకు ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న కణితిని తొలగించారు. ప్రస్తుతం లక్ష్మమ్మ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

ప్రైవేటు ఆస్పత్రికి వెళితే ఈ అరుదైన ఆపరేషన్‌కు లక్షలు ఖర్చయ్యేవని.. కానీ ఎమ్మెల్యే వంశీకృష్ణ పైసా ఖర్చు లేకుండా స్వయంగా శస్త్రచికిత్స చేసి కణితిని తొలిగించారని తెలిపిన లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు.. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చేసిన ఈ ఆపరేషన్ గురించి తెలిసి.. నియోజకవర్గ ప్రజల నుంచి ఎమ్మెల్యేను కొనియాడుతున్నారు. అటు సోషల్ మీడియాలోనూ ఎమ్మెల్యేపై నెటిజన్ల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇదిలా ఉంటే.. సీబీఎం ట్రస్ట్ ఛైర్ పర్సన్ డాక్టర్ అనురాధ ఆధ్వర్యంలో అచ్చంపేట ఏరియా ఆస్పత్రిలో రోగులు కూర్చునేందుకు కుర్చీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో 'నోటా'..

తెలంగాణలో మరికొన్ని రోజుల్లో స్థానిక సంస్థలు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో.. రాష్ట్ర ఎన్నికల సంఘం సరికొత్త విధానం తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు.. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో భేటీ అయ్యింది. ఎన్నికల్లో నోటాను ఓ కల్పిత అభ్యర్థిగా పరిగణించాలా వద్దా అనే అంశాన్ని రాజకీయ పార్టీలతో చర్చించింది. ఈమేరకు కొన్ని ప్రతిపాదనలు తెలపగా.. రాజకీయ పార్టీల నుంచి భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరి ఎవరెవరూ ఏమన్నారో చూడండి.

తెలంగాణలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఎన్నికల సంస్థ ఇప్పటి నుంచి గ్రౌండ్ వర్క్ మొదలుపెట్టేసింది. ఇందులో భాగంగానే.. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కీలక విషయంపై చర్చించింది. ట్రయల్ ప్రాతిపదికన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నోటాను కూడా ఒక కల్పిత అభ్యర్థిగా పెట్టాలా వద్దా అనే అంశంపై రాజకీయ పార్టీల అభిప్రాయం తీసుకుంది. రాజకీయ పార్టీల ముందు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కొన్ని ప్రతిపాదనలు పెట్టగా.. ఈ అంశంపై పార్టీల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. ఈ పద్దతిని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించగా.. ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ మాత్రం స్వాగతించింది. బీజేపీ మాత్రం రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆ అధికారం లేదని.. రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఇక.. సీపీఎం కూడా నోటా ఉండాలని చెప్పింది కానీ.. అభ్యర్థిగా మాత్రం గుర్తించొద్దని స్పష్టం చేసింది.

నోటాపై ఎన్నికల సంఘం ప్రతిపాదనలు

ఎన్నికల ఫలితాలను ప్రకటించేటప్పుడు నోటాను ఒక "కల్పిత ఎన్నికల అభ్యర్థి"గా పరిగణిస్తారు. ఈ క్రమంలో పోటీ చేస్తున్న అభ్యర్థి.. నోటా (కల్పిత ఎన్నికల అభ్యర్థి) తో అత్యధిక సంఖ్యలో సమాన ఓట్లను పొందినట్లయితే.. పోటీ చేస్తున్న అభ్యర్థినే ఎన్నికైనట్టు ప్రకటిస్తారు. ఒకవేళ.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ వ్యక్తిగతంగా నోటా (కల్పిత ఎన్నికల అభ్యర్థి) కంటే తక్కువ ఓట్లు పొందితే మాత్రం.. పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో ఏ ఒక్కరూ ఎన్నికైనట్టు ప్రకటించరు. అలాంటి సందర్భంలో.. ఆ స్థానానికి తిరిగి ఎన్నిక నిర్వహిస్తారు. అందులోనూ.. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తిరిగి ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులు కారు. ఆ ఎన్నికల్లోనూ.. నోటాకు మళ్లీ అత్యధిక ఓట్లు వస్తే.. ఆ తర్వాత మరోసారి ఎన్నికలు నిర్వహించబడవు. రెండోసారి నిర్వహించిన ఎన్నికల్లో నోటాను మినహాయించి.. పోటీ చేసిన అభ్యర్థుల్లో ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తాయో వారినే ఎన్నికైనట్టుగా ప్రకటిస్తారు.

నోటాపై రాజకీయ పార్టీల అభిప్రాయాలు

అయితే.. ఎన్నికల సంఘం పెట్టిన ఈ ప్రతిపాదనలుపై రాజకీయ పార్టీలు భిన్న అభిప్రాయాలను వెలిబుచ్చాయి. నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించింది. ఒకవేళ నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చి ఎన్నికలు మళ్లీ నిర్వహించాల్సి వస్తే.. అటు ప్రభుత్వానికి, ఇటు అభ్యర్థులకు ఖర్చు పెరిగిపోతుందని.. హస్తం పార్టీ నేతలు చెప్పుకొచ్చారు. మొత్తానికి నోటాకు హస్తం పార్టీ 'నో' చెప్పింది.

ఇక.. నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించడాన్ని ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం పూర్తిగా స్వాగతించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవానికి బెదిరింపులు, బలప్రదర్శన చేసే అవకాశం ఉందని గులాబీ పార్టీ పేర్కొంది. ఈ క్రమంలో.. నోటా ఉండాలని అభిప్రాయపడుతూ.. ఎన్నికల సంఘం ప్రతిపాదనలకు కారు పార్టీ 'ఎస్' చెప్పింది. ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టులో కేసు ఉందని గుర్తుచేసిన బీజేపీ.. తమ అభిప్రాయం ఇప్పుడే చెప్పలేమని తెలిపారు. అయినప్పటికీ.. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి నిర్ణయం తీసుకునే అవకాశం లేదని.. పంచాయతీ ఎన్నికలు ఎలా నిర్వహించాలనే నిర్ణయం ప్రభుత్వమే తీసుకోవాలని కమలం పార్టీ స్పష్టం చేసింది. మరోవైపు.. నోటాతో ఎన్నిక ఉండాలని సుప్రీంకోర్టు ఇప్పటికే చెప్పిందని గుర్తు చేసిన సీపీఎం.. నోట ఉండాలని అయితే అభ్యర్థి కంటే నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే మాత్రం మళ్లీ ఎన్నికలు నిర్వహించటం కరెక్ట్ కాదని అభిప్రాయపడింది. కాగా.. ఈ అంశంపై తమ అభిప్రాయాన్ని రెండు రోజుల్లో చెప్తామని తెలంగాణ తెలుగుదేశం పార్టీ చెప్పగా.. బరిలో ఒక్క అభ్యర్థి ఉన్నా సరే.. నోటా ఉండాలని జనసేన పార్టీ తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

# ఉత్సాహంగా...ఉల్లాసంగా..

### - ఆపద మిత్ర వాలంటీర్లకు విజయవంతంగా కొనసాగుతున్న శిక్షణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 12**



విపత్తులు సంభవించిన సమయాల్లో వెనువెంటనే సహాయక చర్యలు చేపట్టేలా ఆపద మిత్ర వాలంటీర్లకు వివిధ అంశాలలో అందిస్తున్న శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. సుశిక్షితులైన ఎన్.డీ.ఆర్.ఎఫ్, అగ్నిమాపక, మత్స్య శాఖ అధికారులతో పాటు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనే అంశాలపై ఆపదమిత్ర వాలంటీర్లకు శిక్షణ అందిస్తుండగా, వారు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొంటున్నారు. జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద రఘునాథ చెరువులో బుధవారం వరదలు, నీటి ప్రమాద ఘటనలు జరిగినప్పుడు చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఆపదమిత్రలకు ప్రయోగాత్మక శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ శిక్షణా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. రెస్క్యూ బోట్ ను ఎలా ఆపరేట్ చేయాలి, రెస్క్యూ రోప్, రెస్క్యూ ట్యూబ్, రెస్క్యూ గార్డ్, ఫ్లోటర్ తదితర వాటిని ఎలా వినియోగించాలి అనే అంశాలను హైదరాబాద్ లోని మణికొండ కు చెందిన నోబుల్ లైఫ్ సేవింగ్ సొసైటీకి చెందిన మాస్టర్ ట్రైనర్ మహేష్, వినోద్, అనితా పటేల్ లు స్వయంగా చేసి చూపిస్తూ, ఆపదమిత్ర కార్యకర్తలతో చేయించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రకృతిపరంగా, మానవ తప్పిదాల వల్ల విపత్తులు సంభవించిన సందర్భాల్లో ఆపదమిత్ర కార్యకర్తలు తక్షణమే స్పందించి సహాయక చర్యలు చేపట్టే విధంగా వారిని అన్ని విధాలుగా సన్నద్ధం చేయడం జరుగుతోందని అన్నారు. అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు, నీటి ప్రమాదాలు, భారీ జన సందోహం సమయాల్లో తొక్కిసలాట నివారణ, అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన సేవలు తదితర అంశాలపై మూడు దశల్లో 22 రోజుల పాటు ఆపద మిత్రలకు శిక్షణ అందించడం జరుగుతోందన్నారు. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి పది వేల రూపాయల విలువ చేసే విపత్తు సహాయ పరికరాలు అందించడంతో పాటు గుర్తింపు కార్డులు, బీమా సదుపాయాన్ని వర్తింపజేస్తామని అన్నారు. ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి టి.పరమేశ్వర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఏ.విక్రమ్, కలెక్టరేట్ లోని విపత్తుల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు తదితరులు శిక్షణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.



## 16 నుంచి మరోసారి కులగణన సర్వే..



తెలంగాణలో మరోసారి కులగణన సర్వే నిర్వహించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. తెలంగాణ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కులగణన సర్వేలో చాలా మంది పాల్గొనకపోవటంతో.. వారికి మరో అవకాశం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం కులగణన సర్వే. అయితే.. తెలంగాణ సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే పేరుతో నిర్వహించిన ఈ సర్వేలో.. వివిధ కారణాల వల్ల రాష్ట్రంలోని 3.1 శాతం మంది పాల్గొనలేదని ప్రభుత్వం చెప్తోంది. మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లాంటి ప్రముఖులు కూడా సర్వేలో పాల్గొనలేదని చెప్తున్న ప్రభుత్వం.. మరో కీలక ప్రకటన చేసింది. తొలిసారి నిర్వహించిన సర్వేలో పాల్గొనని వారికోసం రాష్ట్రంలో మరోసారి కులగణన సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. సర్వేలో పాల్గొనని వారి కోసం.. ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ మధ్య మరోసారి కులగణన సర్వే నిర్వహించనున్నట్టు భట్టి ప్రకటించారు. రిపోర్టులోని గణంకాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతుండగా.. చాలా మంది ఈ సర్వేలో పాల్గొనలేదని చెప్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అసలు సర్వే జరగనే లేదని చెప్తున్నారు. మరోవైపు.. మరోసారి సర్వే చేపడితే.. తాము పాల్గొంటామని ప్రభుత్వానికి పలు విజ్ఞప్తులు వస్తున్న నేపథ్యంలో.. మరోసారి కులగణన సర్వే నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి ప్రకటించారు.

ఈ మేరకు మీడియా సమావేశంలో మాట్లాడిన భట్టి విక్రమార్క కీలక విషయాలు వెల్లడించారు. తెలంగాణలో మరోసారి సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. తొలిసారి చేపట్టిన కులగణన సర్వేలో ఎవరైతే పాల్గొనలేదో వారికి మరోసారి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందులో భాగంగా ఫిబ్రవరి 16 నుంచి 18వ తేదీ మధ్య మరోసారి కులగణన సర్వే నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సర్వేలో పాల్గొనే వారు టోల్ ఫ్రీ, మండల కేంద్రాలు, ఆన్‌లైన్ ద్వారా సర్వేలో పాల్గొనవచ్చని భట్టి విక్రమార్క వివరించారు. కేసీఆర్, కేటీఆర్ లాంటి వాళ్లకు మరో అవకాశం ఇస్తున్నామని చెప్పుకొచ్చారు. రాష్ట్ర జనాభాలో వీళ్లు కూడా చేరాలని విజ్ఞప్తి చేస్తున్నామని భట్టి తెలిపారు. మార్చి మొదటి వారంలో కేబినెట్ ఆమోదం తెలుపుతామన్న భట్టి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పుకొచ్చారు. రాబోయే అసెంబ్లీలో బిల్లు పెట్టి.. చట్టం చేస్తామని భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం తెలిపి.. ఆ తర్వాత కేంద్రానికి పంపుతామని భట్టి చెప్పుకొచ్చారు. త్వరలోనే.. తెలంగాణ నుంచి బృందంగా వెళ్లి ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, పార్లమెంట్ పెద్దలను కలుస్తామన్నారు. కేంద్రం వద్దకు వెళ్లినప్పుడు తమతో కలిసివచ్చే రాజకీయ పార్టీలను తీసుకెళ్తామన్నారు. దశాబ్దాల బీసీ కల త్వరలోనే నెరవేర్చబోతున్నామని భట్టి చెప్పుకొచ్చారు. ఓబీసీల లక్ష్యాలను సాధించడానికి సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు ప్రకటన తర్వాతే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని భట్టి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లు కల్పించడానికి కేంద్రం చట్టబద్ధత కల్పిస్తుందని ఆశిస్తున్నామని ఆకాంక్షించారు. ఈ విషయంలో అన్ని పార్టీల ఎంపీలను కలుపుకోని వెళ్తామని భట్టి విక్రమార్క తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు గుడ్‌న్యూస్..




రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు గుడ్‌న్యూస్. హైదరాబాద్ నుంచి మరిన్ని పుష్పక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి ఈ బస్సులు నడవనున్నాయి. మ్తొత్తం ఆరు బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. బస్సు టైమింగ్ వివరాలు వెల్లడించారు.

శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు తెలంగాణ ఆర్టీసీ గుడ్‌న్యూస్ చెప్పింది. మరిన్ని పుష్పక్ సర్వీసులను నడపనున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఇప్పటికే కొన్ని బస్సులు సర్వీసులందిస్తుండగా.. నేటి నుంచి మరో 6 సర్వీసులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ బస్సులు సికింద్రాబాద్ జేబీఎస్ నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. మొత్తం ఆ బస్సులు 24 ట్రిప్పులు నడుపుతున్నట్లు వెల్లడించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, రాణిగంజ్, సెక్రటేరియట్, రవీంద్రభారతి, హజ్‌హౌజ్, నాంపల్లి, గాంధీభవన్, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, బహదూర్‌పుర, ఆరాంఘర్ మీదుగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. సికింద్రాబాద్ నుంచి మద్యాహ్నం 12.55 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.55 గంటలకు చివరి బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి మద్యాహ్నం 12.50 గంటలకు మొదటి బస్సు, రాత్రి 11.50 గంటలకు చివరి బస్సు బయల్దేరుతుందని అన్నారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించాలన్నారు. కాగా, పుష్పక్ బస్సుల నడుపుతుండటంతో ప్రయాణికులకు టెన్షన్ తీరనుంది. ప్రస్తుతం పలువురు ఎక్కువ డబ్బులు చెల్లించి క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్తుండగా.. ఇప్పుడు ఆ తిప్పలు తప్పనున్నాయి.

అధికారుల తనిఖీలతో నిలిచిన బస్సులుఇక హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారుల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలకు భయపడి ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను డ్రైవర్లు వనస్థలిపురంలోనే నిలిపివేశారు. రవాణాశాఖ అధికారుల తనిఖీలు పూర్తయ్యే వరకు బస్సులను సిటీలోకి తీసుకెళ్లబోమని డ్రైవర్లు ప్రయాణికులకు తెగేసి చెప్పారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ట్రావెల్స్ కాల్ సెంటర్లకి కాల్ చేసి మాట్లాడితే వారు నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైనా పత్రాలు లేకుండా రోడ్లపై బస్సులు ఎలా నడుపుతున్నారని డ్రైవర్లను నిలదీశారు. బస్సుల్లో వృద్ధులు, చంటి పిల్లలు ఉన్నారని.. తాము వెళ్లాల్సిన చోటుకు తీసుకెళ్లకుండా ఇక్కడే గంటలకొద్ది నిలిపేయటం ఏంటని మండిపడ్డారు. డ్రైవర్, కాల్ సెంటర్ల నుంచి సరైన స్పందన రాకపోవటంతో కొందరు క్యాబ్‌లు బుక్ చేసుకొని వెళ్లిపోయారు.

## జీహెచ్‌ఎంసీ ఎన్నికలకు కూడా బీఆర్ఎస్ దూరమా..?



తెలంగాణ రాజకీయాలు రోజు రోజుకు ఊహించని మలుపులు తిరుగుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధిస్తామని రంగంలోకి దిగిన బీఆర్ఎస్ పార్టీ.. అనూహ్యంగా ఓటమి పాలైంది. ఏమాత్రం అంచనాలు లేకుండా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వచ్చిన పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అదే జోరు కంటిన్యూ చేయగా.. బీఆర్ఎస్ పార్టీ కనీసం ఒక్క సీటు కూడా గెలవకుండా ఘోరాతి ఘోరమైన పరాజయాన్ని మూటగట్టుకుంది. కాగా.. ఇప్పుడు పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుండగా.. వాటికి దూరంగా ఉంటోంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల మీద ప్రత్యేక దృష్టి పెట్టిన బీఆర్ఎస్.. మరి త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లోనూ పోటీ చేస్తుందా లేదా అన్నది ఆసక్తిరంగా మారింది. ఈ అంశంపై మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈనెల 25న జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల నేపథ్యంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఈరోజు (ఫిబ్రవరి 12న) ఉదయం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ కార్పొరేటర్ల సమావేశం జరిగింది. సమావేశం అనంతరం తలసాని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 17లోపు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తలసాని స్పష్టం చేశారు. పోటీ చేయాలా, వద్దా అప్పుడు చెబుతామని తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. త్వరలోనే.. గులాబీ బాస్ కేసీఆర్‌తో బీఆర్ఎస్ కార్పొరేటర్లు సమావేశమవుతారని తెలిపారు. త్వరలో మాజీ సీఎం కేసీఆర్‌తో కార్పొరేటర్లు సమావేశం అవుతారు. రాష్ట్రంలో బీసీ మూమెంట్ చాలా ఎక్కువగా ఉందని తలసాని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన లెక్కల ప్రకారం బీసీ జనాభా చాలా తక్కువగా ఉందని.. ఒరిజినల్ బీసీలు 57 శాతం కంటే ఎక్కువగా ఉన్నారని.. కానీ ప్రభుత్వం మాత్రం బీసీ జనాభాను తగ్గించి చూపించిందన్నారు. జనాభా తక్కువ చూపించడం ద్వారా బడ్జెట్ కేటాయింపులు కూడా తక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. బీసీలకు సీట్లు కూడా తక్కువగా వస్తాయన్నారు. రీసర్వే చేస్తే కేసీఆర్, కేటీఆర్ కూడా పాల్గొంటారని తలసాని ఆసక్తికర కామెంట్లు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా ఎలాంటి ఫలితం వచ్చినా.. హైదరాబాద్‌లో మాత్రం బీఆర్ఎస్ తన హవా గట్టిగానే చూపించింది. కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాకపోగా.. మొత్తం సీట్లు గులాబీ పార్టీనే కైవసం చేసుకుంది. అయితే.. తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో కొందరు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు.. గులాబీ కండువా తీసేసి హస్తంతో దోస్తీ కట్టారు. అందులో.. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవటంతో.. హైదరాబాద్‌లో కూడా బీఆర్ఎస్ బలం తగ్గినట్టయింది. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో గులాబీ పార్టీ పోటీ చేస్తుందా లేదా అన్నది ఆసక్తికర చర్చ నడుస్తోంది.

## ఈసారి వాళ్లందరి ఖాతాల్లో డబ్బులు జమ..

తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ వినిపించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు రైతుభరోసా పేరుతో పెట్టుబడి సాయం అందిస్తోంది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. జనవరి 26వ తేదీన పథకాన్ని ప్రారంభించిన సర్కార్.. ఎకరం, రెండెకరాలు ఇలా వరుసగా సాగు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ చేస్తోంది. ఈ క్రమంలోనే.. తాజాగా మూడెకరాలున్న రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయాన్ని జమ చేసింది ప్రభుత్వం.

తెలంగాణ రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ మరో భారీ శుభవార్త వినిపించింది. జనవరి 26వ తేదీ నుంచి రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందిస్తోన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. తొలుదు పైలెట్ ప్రాజెక్టు కింద జనవరి 27న 563 గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం జమ చేయగా.. ఆ తర్వాత ఒక్క ఎకరా ఉన్న రైతులకు, రెండు ఎకరాలున్న అన్నదాల అకౌంట్లలో డబ్బు జమ చేసింది. కాగా.. ఇప్పుడు మూడు ఎకరాలు సాగు చేస్తున్న రైతులకు రైతు భరోసా డబ్బులు జమ చేసినట్టు వ్యవసాయ శాఖ ప్రకటించింది.

కాగా.. రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించేందుకు రేవంత్ రెడ్డి సర్కార్.. రూ.2223.46 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. కాగా.. సాగు చేస్తున్న భూమిని (ఎకరాల్లో) బట్టి వరుసగా పెట్టుబడి సాయం అందిస్తోంది ప్రభుత్వం. మార్చిలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నట్టు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేశారు.

అయితే.. రైతు భరోసా పథకం ప్రారంభించిన వెంటనే జనవరి 27వ తేదీన 563 గ్రామాల్లోని 4,41,911 రైతులకు సంబంధించి 9,48,332.35 ఎకరాలకు పెట్టుబడి సాయం కింద రూ.5,68,99,97,265 నిధులు విడుదల చేసింది ప్రభుత్వం. అనంతరం.. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఎకరం సాగు భూమి ఉన్న 17,03,419 మంది రైతులకు చెందిన 9,29,234.20 ఎకరాలకు రూ.5,57,54,07,019 నిధులు విడుదల చేసింది సర్కార్.

ఇక ఫిబ్రవరి 10వ తేదీన రెండెకరాల సాగు భూమి ఉన్న 8,65,999 మంది రైతులకు చెందిన 11,79,247.17 ఎకరాలకు గానూ రూ.7,07,54, 84,664 జమ చేసింది రేవంత్ రెడ్డి సర్కార్. కాగా.. మొన్నటి వరకు మొత్తంగా 30,11,329 రైతులకు చెందిన 30,56,814.32 ఎకరాలకు రూ.1834,08,88,948 పెట్టుబడి సాయాన్ని లబ్దిదారుల ఖాతాల్లో జమచేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. తాజాగా.. మూడు ఎకరాల సాగు భూమి ఉన్న రైతులకు కూడా పెట్టుబడి సాయాన్ని అన్నదాతల ఖాతాల్లో జమ చేసినట్టు పేర్కొనటంతో.. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# హద్దులుండవు..



ఎన్టీఆర్ 'దేవర'లో 'చుట్టమల్లే' పాట ఎంత వైరలైందో తెలిసిందే. ఆ సాంగ్ విడుదలైన నాటినుంచి ఇప్పటివరకూ సోషల్ మీడియాలో ట్రెండ్ సృష్టిస్తూనే ఉంది. తాజాగా ఈ పాటను బ్రిటిష్ పాప్ సింగర్ ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరన్ పాడారు. దీనికి సంబంధించిన వీడియో క్షణాల్లో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్టీఆర్ స్పందించారు.

తాజాగా బెంగుళూర్‌లో ఎడ్వర్డ్ క్రిస్టోఫర్ షీరన్ తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ ఈవెంట్‌లో దేవర సినిమాలోని చుట్టమల్లే సాంగ్ పాడి ఆడియన్స్‌లో జోష్ నింపారు. బ్రిటిష్ సింగర్ నోట తెలుగు పాట రావడంతో ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై ఎన్టీఆర్ స్పందిస్తూ.. "సంగీతానికి హద్దులు ఉండవు. మీరు ఈ విషయాన్ని మరోసారి నిరూపించారు. మీ గొంతులో చుట్టమల్లే పాట వినడం నిజంగా ప్రత్యేకం" అంటూ ఆ పాప్ సింగర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆరేళ్ల తర్వాత యంగ్ టైగర్ సోలో రిలీజ్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన 'దేవర' సూపర్ హిట్‌గా నిలిచింది. కొరటాల శివ దర్శకత్వం వహించిన ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా మంచి వసూళ్లు సాధించింది. ఇందులోని పాటలన్నీ భారీ వ్యూస్‌ను సొంతం చేసుకున్నాయి. ప్రత్యేకించి 'చుట్టమల్లే' సాంగ్ సోషల్ మీడియాను షేక్ చేసింది. కొన్ని వందల రీల్స్ ఈ పాటపై షేర్ అయ్యాయి. ఎన్టీఆర్ సరసన జాన్వీ నటించిన ఈ సినిమా సీక్వెల్ వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు. మొదటిభాగం కంటే రెండోభాగం చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందని దర్శకుడు ఇటీవల చెప్పారు. పార్ట్–1లో చూసింది 10 శాతమేనని.. రెండో భాగంలో 100శాతం చూస్తారన్నారు.



# సెట్లో నయన సందడి

ఓ వైపు కథానాయికగా అగ్రతారల సరసన నటిస్తూనే.. మరోవైపు మహిళా ప్రాధాన్య చిత్రాల్లో శక్తిమంతమైన పాత్రల్ని పోషిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది నాయిక నయనతార. ఓ వైపు కథానాయికగా అగ్రతారల సరసన నటిస్తూనే.. మరోవైపు మహిళా ప్రాధాన్య చిత్రాల్లో శక్తిమంతమైన పాత్రల్ని పోషిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది నాయిక నయనతార. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా కథల్ని ఎంచుకుంటున్న ఆమె.. మలయాళ అగ్రకథానాయకుడు మమ్ముట్టితో ఓ సినిమా కోసం జోడీ కట్టినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ వార్తలన్నింటినీ నిజం చేస్తూ నయన సెట్లోకి అడుగుపెట్టినట్లు తెలుపుతూ.. ఆమె మమ్ముట్టితో కలిసి ఉన్న ఫొటోల్ని సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది చిత్రబృందం. మహేశ్ నారాయణన్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్టులో మోహన్‌లాల్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. 'ఎమ్ఎమ్ఎమ్ఎన్' (వర్కింగ్ టైటిల్) పేరుతో ముస్తాబవుతున్న ఈ సినిమా ఇటీవలే శ్రీలంకలో చిత్రీకరణ ప్రారంభించుకుంది. ఆశీర్వాద్ సినిమాస్ నిర్మిస్తున్న ఈ సినిమాలో ఫహాద్ ఫాజిల్, కుంచాకో బోబన్ తదితరులు నటిస్తున్నారు.

# ఆర్టీసీ బస్సులో 'తండేల్'.. స్పందించిన నిర్మాత




తాజాగా విడుదలై హిట్ టాక్‌ను సొంతం చేసుకున్న చిత్రం 'తండేల్' ఈ సినిమా విడుదలైన రోజు నుంచే పైరసీ దీన్ని వేధిస్తోన్న విషయం తెలిసిందే. ఏపీఎస్ఆర్టీసీ బస్సులో దీన్ని ప్రదర్శించడంపై నిర్మాత బన్నివాసు స్పందించారు. సంస్థ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేస్తూ పోస్ట్ పెట్టారు. "ఓ మీడియా సంస్థలో వచ్చిన వార్త ద్వారా ఏపీఎస్ఆర్టీసీ బస్సులో తండేల్‌ను ప్రదర్శించారని తెలుసుకున్నాం. ఇది చట్ట విరుద్ధం, అన్యాయం మాత్రమే కాదు సినిమాకు జీవం పోయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోన్న ఎంతోమంది వ్యక్తులను అవమానించడమే. ఒక సినిమా ఎంతోమంది ఆర్టిస్టులు, దర్శకులు, నిర్మాతల కల" అని పేర్కొన్నారు. దీనికి పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావును బన్నివాసు కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

నాగచైతన్య సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఫిబ్రవరి 7న థియేటర్లలో విడుదలైంది. దీన్ని పైరసీ చేసి కొందరు ఆన్‌లైన్‌లో అప్ చేయడంతో అది సోషల్ మీడియాలోనూ తెగ షేర్ అవుతోంది. ఇటీవల ఓ లోకల్ ఛానల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. దీని గురించి నిర్మాత బన్నివాసు ప్రెస్‌మీట్‌లో స్పందించారు. "సినిమా పైరసీ వస్తుంది.. చూసేద్దామని చాలామంది అనుకుంటుంటారు. మా 'గీత గోవిందం' సినిమా పైరసీ చేసిన వారిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. వారిలో కొందరు ఇప్పుడిప్పుడే జైలు నుంచి బయటకు వస్తున్నారు. 'గీతా ఆర్ట్స్' సినిమాలను పైరసీ చేసినవారిని, వాటిని డౌన్‌లోడ్ చేసుకొని చూసిన వారిని తేలిగ్గా వదిలేస్తామని అనుకోవద్దు" అని పేర్కొన్నారు.

# 'జాబిలమ్మా నీకు అంత కోపమా' ట్రైలర్ రిలీజ్



తమిళ నటుడు ధనుష్ మెగాఫోన్ పట్టి మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. దర్శకుడిగా ఇటీవల రాయన్ సినిమాతో సూపర్ హిట్ అందుకున్న ధనుష్ మరో సినిమాను విడుదలకు సిద్ధం చేశాడు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం జాబిలమ్మా నీకు అంత కోపమా. మలయాళ బ్యూటీ ప్రియా ప్రకాష్ వారియర్, అనిఖా సురేంద్రన్ ఈ సినిమాలో హీరోయిన్లుగా నటిస్తుండగా పవిష్, మాథ్యూ థామస్ కథానాయకులుగా నటిస్తున్నారు. వెంకటేష్ మీనన్, రబియా ఖాటూన్, రమ్య రంగనర్థన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. వండర్‌బేర్ బ్యానర్‌పై ఈ సినిమాను కస్తూరి రాజా, విజయలక్ష్మి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాను ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ట్రైలర్ చూస్తుంటే లవ్ కామెడీ బ్యాక్ డ్రాప్‌లో ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాకు జీవీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నాడు. గత ఏడాది యూట్యూబ్‌లో ట్రెండ్ అయిన గోల్డెన్ స్పారో అంటూ ప్రియాంక మోహనన్ డ్యాన్స్ చేసిన పాట కూడా ఈ సినిమాలోనిదే.

# జైలులో ఉన్నప్పుడే మంచిగా నిద్రపోయాను



తాను జైలులో మాత్రమే మంచిగా నిద్రపోయినట్లు చెప్పుకోచ్చాడు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్. బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ తన నిద్రకు సంబంధించి ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. తన మేనల్లుడు అర్హాన్ ఖాన్ నిర్వహించిన డంబ్ బిర్యానీ అనే పాడ్‌కాస్ట్‌లో చీఫ్ గెస్ట్‌గా హాజరయ్యాడు సల్మాన్ ఖాన్. ఈ పాడ్‌కాస్ట్‌లో భాగంగా సల్మాన్ మాట్లాడుతూ.. తాను జైలులో ఉన్నప్పుడే ఎక్కువగా నిద్రపోయినట్లు వెల్లడించాడు.

నాకు సాధారణంగా అందరిలాగా నిద్రపట్టదు. పడుకుంటే గంటన్నర లేదా రెండు గంటలు అంతే నిద్రపోతాను. ఆపై ఏదో ఒక రోజు నెలకు ఒకసారి, ఏడు గంటలు నిద్రపోతాను. షూటింగ్‌లో టైంలో దొరికినప్పుడు షాట్ల మధ్య నిద్రపోతాను. షూటింగ్‌లలో కుర్చీలపై పడుకున్న రోజులు కూడా ఉన్నాయి. అయితే నేను ఎక్కువగా నిద్రపోయిందంటే జైలులో ఉన్నప్పుడే. అక్కడ అయితే ఏ ఇబ్బంది లేకుండా 8 గంటలు నిద్ర పోయేవాడిని. నేను ఏం చేయాలనే ప్రదేశాలలో ఉన్నప్పుడు నిద్ర మాత్రమే పోతాను అంటూ చెప్పుకోచ్చాడు.

# 'లైలా' సినిమాకు బాయ్‌కాట్ ట్రెండ్..



మాస్ కా దాస్ విశ్వక్ సేన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లైలా చిత్రం తాజాగా వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో నటుడు 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం ఒక వర్గానికి కోపం తెప్పించాయి. వివరాల్లోకి వెళితే.. విశ్వక్ నటిస్తున్న తాజా చిత్రం లైలా. ఈ సినిమాకు దర్శకుడు రామ్ నారాయణ్ దర్శకత్వం వహిస్తుండగా.. సాహు గార్లపాటి నిర్మిస్తున్నారు. వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ఈ సినిమా థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా వచ్చి చిత్రబృందానికి ఆల్ ది బెస్ట్ విషెస్ తెలిపాడు. అయితే ఈ వేడుకలో 30 ఇయర్స్ ఇండస్ట్రీ ఫేం పృథ్వీ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష పార్టీ వైసీపీని ఉద్దేశించి పరోక్ష వ్యాఖ్యలు చేశాడు. ఈ సినిమాలోని ఓ సన్నివేశం గురించి పృథ్వీ చెబుతూ.. ఇందులో నేను మేకల సత్తిగా చేశానని తెలిపారు. అయితే మేకలు ఎన్ని ఉన్నాయని షాట్ మధ్యలో అడిగితే 150 ఉన్నాయని తెలిపాను. అయితే షాకింగ్ ఎంటో కానీ సినిమా చివరిలో లెక్కేస్తే మొత్తం 11 గొర్రెలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఇదేంటో అర్థం కాలేదని, అన్నీ సినిమాలో బ్రహ్మాండంగా పెట్టారంటూ కామెంట్లు చేశారు. అయితే ఈ కామెంట్లు వైసీపీని ఉద్దేశించే చేశాడంటూ వైసీపీ అభిమానులు ఆరోపిస్తున్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికలలో 151 సీట్లు గెలిచిన వైసీపీ గత ఎన్నికలలో 11 సీట్లకు మాత్రమే పరిమితం అయ్యింది. దీంతో పృథ్వీ వైసీపీ గురించే కామెంట్లు చేశాడని లైలా సినిమాను బాయ్‌కాట్ చేయాలంటూ ట్రెండ్‌ని స్టార్ట్ చేశారు. చిత్రబృందం నేడు సాయంత్రం ప్రెస్‌మీట్ పెట్టి క్షమాపణలు చెప్పబోతున్నట్లు తెలుస్తుంది.

# కుమారుడి మాటలు గుర్తుచేసుకున్న సైఫ్ అలీఖాన్



దాడి జరిగిన తర్వాత మొదటిసారి సైఫ్ అలీఖాన్ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఆ సమయంలో తన కుమారుడి మాటలు గుర్తుచేసుకున్నారు.

దుండగుడి దాడిలో బాలీవుడ్ హీరో సైఫ్ అలీఖాన్ గాయపడిన విషయం తెలిసిందే. ఆసుపత్రిలో చికిత్స తీసుకొన్న ఆయన ప్రస్తుతం విశాంత్రి తీసుకుంటున్నారు. దాడి తర్వాత మొదటిసారి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సైఫ్.. ఆరోజు తన కుమారుడు తైమూర్ మాటలను గుర్తుచేసుకున్నారు. కత్తితో పొడిచినట్లు మొదట తనకు తెలియలేదని చిన్న గాయం అయిందనుకున్నట్లు సైఫ్ అన్నారు. తర్వాత వీపు భాగంలో నొప్పి రావడంతో కత్తితో దాడి చేసినట్లు తెలిసిందన్నారు.

"నాకు వీపులో విపరీతమైన నొప్పి కలిగింది. అప్పుడు గమనిస్తే కత్తితో దాడి చేసినట్లు తెలిసింది. అది చూసి కరీనాకపూర్ ఎంతో కంగారుపడింది. అందరికీ ఫోన్లు చేసింది. ఎవరూ ఫోన్ తీయలేదు. ఒకరినొకరం చూసుకున్నాం. నేను బాగానే ఉన్నాను.. నాకేం కాదని ఆమెకు ధైర్యం చెప్పాను. తైమూరు నా దగ్గరకు వచ్చి 'నాన్నా.. నువ్వు చనిపోతావా?' అని అడిగాడు. అలా ఏం జరగదన్నాను" అని చెప్పారు.

సైఫ్‌ను ఇబ్రహీం ఆసుపత్రిలో చేర్చినప్పుడు అతడితో పాటు తైమూర్ కూడా ఆసుపత్రికి వచ్చినట్లు లీలావతి వైద్యులు విడుదల చేసిన నివేదికలో ఉంది. దీని గురించి సైఫ్ మాట్లాడుతూ.. "దాడి జరిగిన తర్వాత కొంతసేపటికి నా కుమారుడు చాలా కూల్‌గా ఆలోచించాడు. 'నేనూ మీతో వస్తాను' అని ఆసుపత్రికి వచ్చాడు. నేను కూడా ఒంటరిగా వెళ్లాలనుకోలేదు. అందుకే నాతోపాటు తైమూర్‌ను తీసుకెళ్లాను. ఒకవేళ నాకు ఏమైనా జరిగినా ఆ సమయంలో నా కుమారుడు నా పక్కనే ఉండాలని కోరుకున్నాను" అని సైఫ్ వివరించారు. ముగ్గురూ ఆటోలోనే ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. మరోవైపు ఈ దాడి కేసులో కీలక పురోగతి కనిపిస్తోంది. దర్యాప్తులో భాగంగా ముంబయి పోలీసులు ఇటీవల ఐడెంటిఫికేషన్ పెరేడ్ చేపట్టారు. ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్న నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులైన సైఫ్ ఇంటి సహాయకులకు చూపించారు. ఆర్థర్ జైలులో అధికారుల సమక్షంలో జరిగిన ఈ ఐడెంటిఫికేషన్ పెరేడ్‌లో నిందితుడిని వారు గుర్తించారు. సైఫ్‌పై దాడి చేసింది అతడేనని తెలిపారు.

# ప్రియుడికి ప్రేమతో విషెస్..



పాయల్ రాజ్‌పుత్ తాజాగా తన లవర్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపింది. పంజాబీ ఇండస్ట్రీలో ఉన్నప్పుడు పాయల్ రాజ్‌పుత్‌కు ఈ సౌరభ్ ధింగ్రాకు పరిచయం, ప్రేమ వంటివి ఏర్పడినట్టుగా ఉన్నాయి. నిత్యం పాయల్ వెంటే ఇతగాడు కనిపిస్తుంటాడు. షూటింగ్‌కి ఎక్కడకు వెళ్లినా ఇతగాడు ఉంటాడు. ఇక పాయల్‌కు మేనేజర్‌గానూ వ్యవహరిస్తున్నాడని పిస్తోంది. ప్రస్తుతం ఈ ఇద్దరూ డేటింగ్ అంటూ చక్కర్లు కొట్టేస్తున్నారని ఆ ఫోటోలను చూస్తేనే తెలుస్తోంది. పాయల్ రాజ్‌పుత్ ప్రస్తుతం తెలుగు తెరపై ఎక్కువగా సందడి చేయడం లేదు. మంగళవారం అంటూ మంచి చిత్రాన్ని తన ఖాతాలో వేసుకుంది. నటిగానూ మెప్పించే ప్రయత్నం చేసింది. కానీ పాయల్‌కు మళ్లీ ఓ మంచి ఆఫర్ రాలేదనిపిస్తోంది. వెంకటలచ్చిమి అనే ప్రాజెక్టులో పాయల్ అయితే నటిస్తోంది. ఈ మధ్యే మంగళవారం సీక్వెల్‌కు సంబంధించిన రూమర్లు వచ్చాయి. అయితే ఈ రెండో పార్టులో మాత్రం పాయల్ నటించడం లేదని, ఆమె పాత్రతో సంబంధం లేదని అంటున్నారు.

ఇక పాయల్ ఇప్పుడు మళ్లీ బిజీ అయ్యే ఛాన్స్ అయితే కనిపించడం లేదు. ఇక పాయల్ ఎక్కువగా తన ప్రియుడు మీదే ఫోకస్‌తో ఉన్నట్టుగా కనిపిస్తోంది. అతనితో కలిసి ఈ మధ్య ఓ ప్రైవేట్ ఆల్బమ్ కూడా చేసింది. ఈ ఇద్దరూ కూడా ప్రస్తుతం డేటింగ్‌లో ఉన్నారని, ఇక త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కుతారని అంతా అనుకుంటున్నారు. మరి పాయల్ మాత్రం ఇంకా ఈ రిలేషన్ మీద అధికారికంగా స్పందించలేదు. ఈ ఫోటోలు, ఈ పోస్టులు చూస్తే మాత్రం ఇంకా ప్రత్యేకంగా చెప్పాల్సిన పని ఏముందని అంతా అనుకుంటున్నారు. తాజాగా పాయల్ రాజ్‌పుత్ తన ప్రియుడికి ప్రేమగా బర్త్ డే విషెస్ చెప్పింది. నువ్వే నా ప్రపంచం.. అలాంటి నా ప్రపంచానికి పుట్టిన రోజు శుభాకాంక్షలు.. నీలాంటి వాడు నాకు దొరకడం నా అదృష్టం.. ఎలాంటి పరిస్థితుల్లోనూ నన్ను విడిచి పెట్టకుండా నాకు అండగా నిలబడుతావ్.. నాపై ఇంత ప్రేమను కురిపిస్తూ.. నాకు మార్గదర్శకంగా ఉంటున్నందుకు థాంక్స్.. ఆ దేవుడు నీకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఈ ప్రత్యేకమైన రోజున కోరుకుంటున్నాను.. అని పాయల్ పోస్ట్ వేసింది. పాయల్ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీ అవుతుందా? లేదా? అన్నది చూడాలి. ఆమెకు మళ్లీ అజయ్ భూపతి ఛాన్స్ ఇచ్చే వరకు బ్రేక్ వచ్చేలా కనిపించడం లేదు. ఆర్ఎక్స్ 100 తరువాత మళ్లీ మంగళవారం మూవీతోనే ట్రెండ్ అయింది. మళ్లీ పాయల్‌కు ఎప్పుడు బ్రేక్ వస్తుందో చూడాలి.

# అది అసలు జరిగే పనేనా?..



పవన్ కళ్యాణ్ తీన్ మార్ రీ రిలీజ్ కోసం ఫ్యాన్స్ ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్నారు. గత ఏడాది బండ్ల గణేష్ సైతం తీన్ మార్ రీ రిలీజ్ అంటూ సందడి చేశారు. కానీ గబ్బర్ సింగ్ లైన్‌లోకి వచ్చింది. రీ రిలీజ్ కోసం పెట్టిన ప్రెస్ మీట్, అందులో బండ్ల గణేష్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన స్పీచ్ బాగానే వైరల్ అయింది. ఇక ఇప్పుడు తీన్ మార్ గురించి, దాని డబ్బింగ్ సమస్యల గురించి ఓ నెటిజన్ కంప్లైంట్ చేశాడు. దానికి బండ్ల గణేష్ రియాక్ట్ అయ్యాడు.

బండ్ల గణేష్ తీన్ మార్ రీ రిలీజ్ కోసం చాలానే కష్టపడుతున్నాడు. గత ఏడాదే తీన్ మార్ రీ రిలీజ్ చేస్తానని అన్నాడు. కానీ అప్పటికే పోటీలోకి గబ్బర్ సింగ్, గుడుంబా శంకర్ వంటి చిత్రాలు వచ్చాయి. ప్రతీ ఏడాది పవన్ కళ్యాణ్ చిత్రాలు రీ రిలీజ్ అవుతూనే ఉన్నాయి. తొలిప్రేమ, తమ్ముడు, జల్సా, ఖుషి ఇలా అన్ని చిత్రాలు రీ రిలీజ్ అయ్యాయి. ఇక తీన్ మార్ మూవీని మరోసారి చూడాలని ఫ్యాన్స్ కూడా కోరుతున్నారు. బండ్ల గణేష్ కూడా తీన్ మార్ మూవీని మళ్లీ రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాడు.

తాజాగా తీన్ మార్ డబ్బింగ్ మీద ఓ ఫ్యాన్ ఫిర్యాదు చేశాడు. అసలు ఇలా లైవ్ డబ్బింగ్ ఎందుకు ఓకే చేశావ్ అన్నా.. థియేటర్లో అసలు డైలాగ్స్ కూడా వినిపించలేదు అని ట్వీట్ వేశాడు. దీనిపై బండ్ల గణేష్ రియాక్ట్ అయ్యాడు.. ఓకే ఇప్పుడు మళ్లీ డబ్బింగ్ చేయించి.. మంచిగా మిక్సింగ్ చేసి రీ రిలీజ్ చేస్తాను అని మాటిచ్చాడు. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇది సాధ్యమేనా? అని అంతా అనుకుంటున్నారు.

మళ్లీ డబ్బింగ్, మిక్సింగ్ అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. మళ్లీ డబ్బింగ్‌లో ఏదైనా ఇష్యూ వస్తే.. ఆర్టిస్టులు చెప్పేందుకు ముందుకు వస్తారా? అసలు వాళ్ల డేట్లు ఇప్పుడు దొరుకుతాయా? అన్నది కూడా డౌటే. కానీ బండ్లన్న మాత్రం ఇలా అభిమానికి మాత్రం మాటిచ్చేశాడు. చూస్తుంటే బండ్లన్న తీన్ మార్ రీరిలీజ్ పట్ల పంతంతోనే ఉన్నాడనిపిస్తోంది.

బండ్లన్న మళ్లీ ఓ బ్లాక్ బస్టర్ సినిమాను తీస్తానని అన్నాడు. కానీ ఇంత వరకు అడుగు ముందుకు పడలేదు. కాంబినేషన్ సెట్ అవ్వడం లేదో.. మరేతర కారణాలు ఏమైనా ఉన్నాయో గానీ.. ఇంత వరకు బండ్ల గణేష్ కొత్త మూవీకి సంబంధించిన అప్డేట్ రాలేదు. ఒకప్పుడు వరుసగా స్టార్ హీరోలతో సినిమాలు తీసి బ్లాక్ బస్టర్లు అందుకున్న సంగతి తెలిసిందే.